

మేం పోతాం.. పోనియ్యం..!



సీఎం ప్రసంగిస్తుండగానే వెనుదిరుగుతున్న మహిళలు, విద్యార్థినులు

- సీఎం సభలో విచిత్ర పరిస్థితి
- ఉక్కపోతకు ఉండలేక వెనుదిరిగిన జనం
- వెళ్లడానికి వీల్లేదని బారికేడ్లతో బిగేసిన పోలీసులు
- పోలీసులతో వాదులాడి జంప్
- తాగడానికి నీళ్లులేక.. తిండిలేక నానా అవస్థలు

పామర్రు, మార్చి 1 : పామర్రులో శుక్రవారం జరిగిన జగనన్న విద్యాదీవెన సభలో విచిత్ర సంఘటన చోటుచేసుకుంది. అధికారులు, అధికార పార్టీ నేతలు సామ దాన బేధ దండోపాయాలు ప్రయోగించి బస్సులు, వాహనాల్లో జనాన్ని సమీకరించినా.. సభ గ్యాలరీ మొత్తం విద్యార్థులు, డ్వాక్రాసంఘల మహిళలు, ప్రభుత్వ ఉద్యోగులు, రాజకీయ నేతలతోనే నిండింది. ఇతర ప్రాంతాల నుంచి బస్సుల్లో పెద్దఎత్తున తరలించిన జనం లోపలికి వెళ్లినా అక్కడ కూర్చోలేకపోయారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఉక్కపోతతో ఉడికిపోయారు. లోపల ఉండలేక బయటకొచ్చేందుకు ప్రయత్నించారు. ఎవర్నీ బయటకెళ్లనీయకుండా పోలీసులు బారికేడ్లతో బంధించేశారు. అయినా ఉండలేక కొందరు పోలీసులతో గొడవ పడి అక్కడి బలవంతంగా బయటికొచ్చారు. కొంతమందికి తాగడానికి నీళ్ల దొరక్క సొమ్మసిల్లి పడిపోయారు. కొందరు వైద్య శిబిరాల్లో ఆరోగ్య సిబ్బంది ఇచ్చిన ఓఆర్‌ఎస్‌లతో సేదతీరారు.

• సభకు రాకుంటే పథకాలు రద్దు

పామర్రులో శుక్రవారం నిర్వహించిన జగనన్న విద్యాదీవెన సభకు రాకుంటే ప్రభుత్వం సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని అధికారులు, అధికార పార్టీ నేతలు హెచ్చరించడంతో రాక తప్పలేదని కొందరు రుసరుసలాడారు. గ్రామైఖ్య సంఘల వీఓలు గ్రామ వలంటీర్ల ద్వారా సభకు తీసుకొచ్చారని చెప్పారు.



నడి ఎండలో రోడ్డుపై మహిళలు

వెనకడుగు

ఎస్సీ రిజర్వుడు స్థానాలపై సీఎం జగన్ రివర్స్‌గేర్

ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో సిటింగ్‌ల మార్పుపై వైసీపీ అధినేత జగన్ తొలుత తీసుకున్న నిర్ణయంపై వెనకడుగు వేశారా? పామర్రు సభలో ఆయన ప్రసంగం చూస్తే అవుననే అనిపిస్తోంది. స్థానిక ఎమ్మెల్యే కైలే అనీల్‌ను పొగడ్తలతో ముంచెత్తిన సీఎం ఆ సీటును ఆయనకు దాదాపు ఖరారు చేసినట్టే అయ్యింది. ఎన్టీఆర్ జిల్లాలోని రెండు ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో తిరువూరు నుంచి రక్షణనిధిని పక్కనపెట్టిన జగన్.. నందిగామ నుంచి మొండితోక జగన్మోహనరావుకు మొండిచేయి చూపుతారని ప్రచారం జరగడం, దళితుల నుంచి వ్యతిరేకత రావడంతో ఆయన కృష్ణాజిల్లాలో ఎస్సీ రిజర్వుడు అయిన పామర్రును అనీల్‌కే ఇవ్వాలని నిర్ణయించుకున్నారని, అందుకే పొగడ్తలతో ముంచెత్తారని వైసీపీ శ్రేణులే చర్చించుకుంటున్నాయి.



పామర్రు సభలో మాట్లాడుతున్న సీఎం జగన్, పక్కన ఎమ్మెల్యే కైలే

- రెండు జిల్లాల్లో మూడు ఎస్సీ రిజర్వుడు స్థానాలు
- తొలుత తిరువూరు నుంచి రక్షణనిధి ఔట్
- నందిగామ నుంచి మొండితోకకు మొండిచేయేనని ప్రచారం
- దళితుల్లో వ్యతిరేకత రావడంతో వెనక్కి..
- పామర్రు ఎస్సీ రిజర్వుడు కైలే అనీల్‌కు దాదాపు ఖరారు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో సిటింగ్‌లను మార్చేయాలని వైసీపీ అధినేత జగన్ తొలుత భావించారు. అదే ఊపులో తిరువూరు సిటింగ్ ఎమ్మెల్యే రక్షణనిధికి సీటు నిరాకరించి, ఆ స్థానంలో టీడీపీ నుంచి వైసీపీలో చేరిన నల్లగట్ల స్వామిదాసుకు కేటాయించారు. నందిగామ, పామర్రు నియోజకవర్గాల్లో సైతం సిటింగ్‌లను మారుస్తారన్న ప్రచారం జోరుగా సాగింది. విడతలవారీగా 8 జాబితాలు విడుదల చేసినా ఈ రెండు నియోజకవర్గాల సిటింగ్ ఎమ్మెల్యేలకు సీటు ఖరారు కాలేదు. దీంతో వారిపైనా వేటు తప్పదనే భావించారు. కానీ, శుక్రవారం పామర్రులో జరిగిన జగనన్న విద్యాదీవెన సభలో సీఎం జగన్ ప్రసంగంలో స్థానిక ఎమ్మెల్యే కైలే అనీల్‌పై ప్రశంసల వర్షం కురిపించడం చర్చనీయాంశంగా మారింది. 'అనీల్ మాదిరి ప్రతి ఒక్క ఎమ్మెల్యే పనిచేస్తే ప్రతి నియోజకవర్గానికి మంచి జరుగుతుంది. మనిషిలో నిజాయితీ ఉంది. నిబద్ధత ఉంది. నా తమ్ముడులాంటి అనీల్‌ను మీరందరూ గొప్పగా దీవించాలని మనసారా ఆకాంక్షిస్తున్నా' అంటూ వైసీపీ అధినేత వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల ద్వారా పామర్రుకు అనీల్ అభ్యర్థిత్వాన్ని జగన్ ఖరారు చేసినట్లేనని వైసీపీ శ్రేణులు వ్యాఖ్యానిస్తున్నాయి.

అప్పుడలా.. ఇప్పుడిలా..!

ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో మూడు ఎస్సీ రిజర్వుడు స్థానాలున్నాయి. వీటిలో 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులే గెలుపొందారు. ఇతర స్థానాల్లో కేవలం నియోజకవర్గాల మార్పిడికి పరిమితమవుతున్న జగన్.. ఎస్సీ రిజర్వుడు స్థానాల విషయంలో మాత్రం సిటింగ్‌లకు టికెట్ నిరాకరిస్తూ వచ్చారు. ఎన్టీఆర్ జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, కేవలం విజయవాడ సెంట్రల్ సిటింగ్ ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు సీటు నిరాకరించారు. అలాగే, రెండు ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో అభ్యర్థులను మార్చేందుకు సిద్ధమయ్యారు. తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధికి టికెట్ నిరాకరించి మొండిచేయి చూపారు. నందిగామ నుంచి సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న మొండితోక జగన్మోహనరావుకూ ఈసారి టికెట్ ఇవ్వడం లేదని ఇప్పటికే వైసీపీ పెద్దలు స్పష్టం చేశారని సమాచారం. కృష్ణాజిల్లాలో ఏకైక ఎస్సీ రిజర్వుడు స్థానమైన పామర్రు అసెంబ్లీ నియోజకవర్గ సిటింగ్ ఎమ్మెల్యే కైలే అనీల్‌కుమార్ సీటుపైనా తొలుత సందిగ్ధత నెలకొంది. అయితే నా ఎస్సీలు.. నా బీసీలు అని చెబుతున్న జగన్ వాస్తవంలో వారిని అణచివేస్తున్నారన్న ప్రచారం తెరపైకి వచ్చింది. దళిత నియోజకవర్గాలే లక్ష్యంగా సిటింగ్‌లకు మొండిచేయి చూపడం ఏమిటని దళిత నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు తనకు సీటు నిరాకరించిన జగన్‌పై రక్షణనిధి ఇప్పటికే నిప్పులు చెరిగారు. తనను నమ్మించి నట్టేట ముంచారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిణామాలతో కంగుతిన్న వైసీపీ పెద్దలు దళిత సిటింగ్‌ల విషయంలో వెనుకడుగు వేసినట్లు సమాచారం. అందులో భాగంగానే పామర్రు సభలో సీఎం అలా వ్యాఖ్యానించారని వైసీపీ శ్రేణుల్లో చర్చ నడుస్తోంది.

వంశీ, సింహాద్రి డుమ్మా



వంశీ



సింహాద్రి రమేశ్

పామర్రులో సీఎం సభకు గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్ గైర్హాజరయ్యారు. మంత్రి జోగి రమేశ్, ఎమ్మెల్యేలు పేర్ని నాని, కొడాలి నాని, కైలే అనీల్, వైసీపీ మచిలీపట్నం అభ్యర్థి పేర్ని కిట్టు, పెడన అభ్యర్థి ఉప్పాల రాము హాజరయ్యారు. వంశీ, రమేశ్ గైర్హాజరవ్వడం వైసీపీ శ్రేణుల్లో చర్చనీయాంశమైంది. సీఎం జిల్లాకు వచ్చినా వీరు హాజరుకాకపోవడానికి గల కారణాలు ఏమై ఉంటాయనే అంశం ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. గన్నవరం నుంచి వంశీకి టికెట్ ఇవ్వడం లేదు. మరోవైపు అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌కు అక్కడ టికెట్ నిరాకరించి మచిలీపట్నం ఎంపీగా బరిలో నిలుపుతున్నట్లు ప్రకటించారు. కానీ, రమేశ్‌కు మొండిచేయి చూపడంలో భాగంగానే ఆయన్ను తాత్కాలికంగా ఎంపీ బరిలో నిలిపారన్నది వైసీపీ వర్గాల్లో జరుగుతున్న చర్చ. ప్రస్తుతం మచిలీపట్నం ఎంపీ బరిలో వైసీపీ తరఫున బాడిగ రామకృష్ణ కుటుంబం నుంచి ఎవరో ఒకరు పోటీ చేస్తారన్న ప్రచారం జరుగుతోంది. టికెట్లు నిరాకరించడం వల్లే వంశీ, రమేశ్ శుక్రవారం నాటి సభకు గైర్హాజరయ్యారన్నది వైసీపీ శ్రేణులు చెబుతున్న మాట.

రాష్ట్ర భవిష్యత్ కోసమే బాబు వెంట

• ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్



నందిగామ, మార్చి 1 : రాష్ట్ర భవిష్యత్‌ను కాపాడాలంటే ప్రతి ఒక్కరూ చంద్రబాబు వెంట నడవాలని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. చంద్రబాబు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరేందుకు ఆయన తన అనుచరులతో కలిసి శుక్రవారం రాత్రి హైదరాబాద్ తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, శనివారం ఉదయం 9 గంటలకు చంద్రబాబు సమక్షంలో తెలుగుదేశంలో చేరుతున్నట్లు తెలిపారు. తాను ఎక్కడ నుంచి పోటీ చేయాలన్న విషయం చంద్రబాబు, లోకేశ్‌ల నిర్ణయంపై ఆధారపడి ఉంటుందన్నారు. సీటు కోసం, పోటీ కోసం కాకుండా రాష్ట్ర భవిష్యత్ కోసం చంద్రబాబు వంటి దార్శినికుడి వెంట నడవాలని తాను నిర్ణయించుకున్నట్టు చెప్పారు. అధినేత సూచనల మేరకు తన భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని ఆయన చెప్పారు.



హిందూ కళాశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

• సజావుగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు జిల్లాలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు హాజరయ్యారు. జిల్లాలో 59 పరీక్షా కేంద్రాల్లో 21 610 మంది విద్యార్థులకు 21,187 మంది (98 శాతం) హాజరయ్యారు. 423 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ తెలుగు, సంస్కృతం, ఉర్దూ, హిందీ పరీక్షలకు 20,865 మంది హాజరయ్యారు. 373 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ పరీక్షలకు 745 మందికి గాను 695 మంది హాజరయ్యారు. మచిలీపట్నంలో 8 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఆర్ఐఓ రవికుమార్ పరీక్షా కేంద్రాలను సందర్శించారు.



స్టార్ కళాశాల వద్ద...

అక్రమ మైనింగ్‌పై అధికారుల దాడి

» మూడు ఎక్స్‌కవేటర్ల సీజ్

- 6లో..



కె.సీతారాంపురంలో ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు కేటాయించిన చెరువు

జగనన్న కాలనీల్లో చేతివాటం!

వైసీపీ నాయకులతో కలిసి స్థలాల పంపిణీలో అధికారుల అక్రమం

పేదలందరికీ ఇళ్లు కట్టించి ఇస్తామని ఊదరకొట్టిన వైసీపీ నేతలు స్థలాల కేటాయింపులో అడ్డగోలు అక్రమాలకు పాల్పడ్డారు. పేదలకు చెందాల్సిన స్థలాలను రెవెన్యూ అధికారులు, స్థానిక నాయకులు అమ్ముకుంటున్నారు. ఒక్కొక్క స్థలానికి రూ.70వేల చొప్పున తీసుకుని అనర్హులకు స్థలాలు కేటాయించారు. కొన్నిచోట్ల కేటాయించిన స్థలాలను కూడా నగదు తీసుకుని వేరొకరికి బదిలీ చేస్తున్నారు. అర్హులకు మాత్రం ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా తిరస్కరించారు.

- స్థల సేకరణతో అవినీతి మొదలు
- అనర్హులకు స్థలాల కేటాయింపు
- రూ.70 వేలు ఇస్తే ఇంటి స్థలం
- అర్హులకు మొండిచేయి
- బాపులపాడు మండలంలో బట్టబయలైన బాగోతం

హనుమాన్‌జంక్షన్ రూరల్ : బాపులపాడు మండలంలోని ఇళ్ల స్థలాల మంజూరులో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అర్హతతో సబంధం లేకుండా రూ.70 వేలు కడితే అనర్హులైనా జగనన్న కాలనీలో ఇంటి స్థలం కేటాయిస్తున్నారని తీవ్ర చర్చ నడుస్తోంది. పురుషులకు అర్హుల జాబితాలో చోటుకల్పించడంతో పాటు ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు, ముగ్గురుకి స్థలాలు కేటాయించారు.

స్థల సేకరణతోనే అవినీతి మొదలు

పేదలకు కేటాయించాల్సిన స్థలాల పరిశీలనలోనే వైసీపీ నాయకుల అండతో అవినీతి మొదలైంది. గ్రామాలకు దూరంగా స్థలసేకరణ చేయడంతోపాటు పొలాలను, చెరువులను జగనన్న కాలనీల కోసం సేకరించారు. స్థల సేకరణలో పొలాల యజమానులతో కుమ్మక్కయిన నేతలు దారిలేని పొలాలను కూడా భారీగా ధరలు పెంచి అమ్ముకునేలా ప్రోత్సహించారు. రెవెన్యూ అధికారులు కూడా సహకరించడంతో ఒక్కొక్క ఎకరానికి లక్షల్లో అవినీతి జరిగినట్టు ఆరోపణలు వస్తున్నాయి. అయినా బాపులపాడు మండలంలోనే 6 గ్రామాల లబ్ధిదారులకు స్థలాలు కేటాయించలేదు.

భూసేకరణ లేకుండా పట్టాల పంపిణీ

బాపులపాడు మండలంలోని రంగన్నగూడెం, తిప్పనగుంట, కాకులపాడు, రంగయ్యప్పారావుపేట, బండారుగూడెం, చిరివాడ గ్రామాల్లో ఇంత వరకూ భూ సేకరణ జరగలేదు. పెరికీడు, కె.సీతారాంపురం, మల్లవల్లిలో భూసేకరణ జరిగి పట్టాలు కేటాయించినా చెరువులు, (ఏపీఐఐసీ) ప్రభుత్వ భూమి కావడం, నష్టపరిహారం కోసం రైతులు పోరాటం చేస్తుండటంతో అక్కడకు వెళ్లి ఇళ్లు కట్టిన తర్వాత కోర్టు చుట్టూ తిరగలేమని కొందరు, కనీసం తమ స్థలం ఏదో కూడా తెలియక అయోమయస్థితిలో మరికొందరు లబ్ధిదారులు వెనకడుగేస్తున్నారు. పెరికీడు, కె.సీతారాంపురంలో 500 మందికిపైగా లబ్ధిదారులకు చెరువుల్లో స్థలాలు కేటాయించి పట్టాలు పంపిణీ చేసి ఏళ్లు గడుస్తున్నా ఇంత వరకూ వారికి పొజిషన్ చూపించలేదు. తాజాగా ఈ గ్రామాలను రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నుంచి తొలగించడంతో వీరందరిలో అయోమయం నెలకొంది. నియోజకవర్గవ్యాప్తంగా ఇప్పటి వరకూ 25వేల మందికిపైగా పట్టాల పంపిణీ జరిగినా అందులో సగం మందికి మాత్రమే కేటాయింపులు జరిగాయి. ఇంకా స్థలాల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి జాబితానే వేలల్లో ఉంది.



KR00898783	KONAMAGUNTA SUBBARAO
KR00923757	KONDE NAGA MANI
KR01029251	KONGALA LEELA
KR01039877	KOPPULA DANAVI
KR00138152	KOTA AAMANI
KR01029194	KOTA LAVANNYA KUMARI
KR00968214	KOTA MOHANA LAKSHMI
KR00143597	KOTA SUNEETHA
KR01030743	KOTHAPALLI NAGA RAJINI KUMARI
KR01035118	KOTHAPALLI SEETHA MAHA LAKSHMI
KR00097921	KOVVURI LAKSHMI
KR00772449	KOVVURI RANGAMANI
KR00904990	KOYYA KURMARAO
KR01039896	KOYYAPU LAKSHMI

లబ్ధిదారుల జాబితాలో రెడ్ మార్కు వద్ద పురుషుల పేర్లు

అనర్హులకు అందలం..

బాపులపాడు మండల కేంద్రంలోనే నాలుగేళ్లకుపైగా పనిచేస్తూ చక్రం తిప్పుతున్న రెవెన్యూ అధికారి పర్యవేక్షణలో అనర్హులకు స్థలాలు కేటాయించారు. మండలంలోనే ఒక గ్రామంలో రెవెన్యూ విభాగంలో పనిచేస్తున్న మహిళకు, పెదపాడు మండలం ఏపూరు గ్రామంలోని మరో మహిళకు అక్రమంగా స్థల కేటాయింపులు జరిగాయి. ఒక్కొక్కరి వద్ద రూ.70 వేలు తీసుకుని ఇప్పటికీ 12 మంది అనర్హుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.

• బాపులపాడు మండలం కె.సీతారామపురంలో వైసీపీకి చెందిన కొందరికి ఒకే ఇంట్లో తల్లీపిల్లలతో పాటు పెళ్లయి విజయవాడలో నివాసముంటున్న ఆడపిల్లలకు కూడా ఇంటి స్థలాలు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన కొందరు మహిళలు పెళ్లయి విజయవాడ, వీరవల్లి తదితర ప్రాంతాల్లో ఉంటున్నా వారందరి పేర్లతోనూ అక్రమంగా స్థలాలు కేటాయించారు. అర్హుల జాబితాలో పురుషులకు కూడా చోటు కల్పించడం కొసమెరుపు.

అర్హులకు మొండిచేయి

మరోపక్క అర్హులైన వారిని పక్కన పెట్టారు. బాపులపాడులో అర్హులైన పి.నాగలక్ష్మి, బి.ఎ.కస్తూరి లాంటివారు సుమారు 60 మంది వరకూ దరఖాస్తు చేసినా వివిధ కారణాలతో తిరస్కరించారు. కారణం అడిగితే ఇన్‌కంట్యాక్స్ ఉందని తిరస్కరించినట్టు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కస్తూరి భర్త దినసరి వేతనంతో స్థానిక ఫ్యాక్టరీలో పనిచేస్తుంటాడు. సొంత ఇల్లు లేక దరఖాస్తు చేసుకుంటే అనర్హులగా తేల్చారు. కె.సీతారాంపురంలో రాజకీయ కారణాలతో అర్హులకు కాలనీల్లో స్థలాలు ఇవ్వలేదు. వారి దరఖాస్తులు కూడా పరిశీలించలేదు. కె.సీతారాంపురానికి చెందిన సీహెచ్ కావ్య భర్త లారీ డ్రైవర్. కావ్య మిషన్ కట్టి జీవనం సాగిస్తుంటారు. సొంత ఇంటికోసం దరఖాస్తు చేస్తే టీడీపీ మద్దతుదారులంటూ దరఖాస్తును తిరస్కరించారు. ఇదే గ్రామానికి చెందిన జి.ఎస్తేరురాణి భర్త పెయింటర్. ఎస్తేరు రాణి ఎంబ్రాయిడరీ వర్కు చేసి జీవనం సాగిస్తుంటారు. సొంతింటి కోసం దరఖాస్తు చేస్తే కనీసం పరిశీలించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

» పరీక్షా కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ దిల్లీరావు

గవర్నర్‌పేట, మార్చి 1 : ఎన్టీఆర్ జిల్లాలో ఇంటర్ పరీక్షలను కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య నిర్వహిస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు అన్నారు. శుక్రవారం ప్రారంభమైన ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షా కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. నగరంలోని బిషప్ అజరయ్య, శ్రీ శారద కళాశాలల కేంద్రాలను పర్యటించి విద్యార్థులకు ఏర్పాట్లు, పరీక్షల తీరును పరిశీలించారు. మొత్తం 99 కేంద్రాల్లో ఇంటర్ ఫస్టియర్ పరీక్షకు 39544 మందిగాను 38822 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. విద్యార్థులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ప్రతి గదిలోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని తెలిపారు. ఒక్కొక్క కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, రెండు సిట్టింగ్ స్క్వాడ్‌లు, 3500 మంది ఇన్విజిలేటర్లను నియమించి పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. పరీక్షా కేంద్రాలలో నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు సౌకర్యాలను కల్పించామన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు.



బిషప్ అజరయ్య పరీక్షా కేంద్రాన్ని సందర్శించి, పరిశీలిస్తున్న కలెక్టర్ దిల్లీరావు



తాళం వేసిన తోట్లవల్లూరు గ్రామ సచివాలయం

ఉద్యోగులంతా సీఎం సభకు..

» సచివాలయ కార్యాలయానికి తాళం!

» డబ్బులిచ్చి సీఎం సభకు జనం తరలింపు.. పౌర సేవలకు ఆటంకం

తోట్లవల్లూరు, మార్చి 1 : పామర్రులో శుక్రవారం జరిగిన విద్యాదీవెన సభకు అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు, వైసీపీ నాయకులు మండలం నుంచి ఆర్టీసీ బస్సులు, ఆటోల్లో జనాన్ని తరలించారు. ఒక్కొక్కరికి రూ.250, రూ.200, బిర్యాని ప్యాకెట్ ఇచ్చి బస్సుల్లోకి ఎక్కించారు. డ్వాక్రా మహిళలను సంబంధిత అధికారులు, బుక్ కీపర్లు గ్రూపుల వారీగా పేర్లు నోట్ చేసుకుని సభకు పంపారు. రానివారికి ఫోన్‌లు చేసి రుణాలు నిలిపివేస్తామని హెచ్చరికలు పంపి రప్పించారు. ఉపాధి కూలీలను కూడా తీసుకెళ్లారు. గ్రామ సచివాలయాల సిబ్బంది కార్యాలయాలకు తాళాలు వేయగా కొన్ని చోట్ల ఒక్కరిని మాత్రమే ఉంచి వెళ్లిపోవడంతో పౌరసేవలకు ఆటంకం కలిగింది.

సీఎం జగన్‌కు పామర్రులో ఘనస్వాగతం

పామర్రు : ఐదోవిడత విద్యాదీవెన పథకం ప్రారంభోత్సవానికి శుక్రవారం తొలిసారిగా విచ్చేసిన ముఖ్యమంత్రి జగన్‌కు పామర్రులో ఘన స్వాగతం లభించింది. బందరు రోడ్డులో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్ద నేతలు పుష్పగుచ్ఛాలు, శాలువాలు కప్పి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, మాజీమంత్రి పేర్నినాని, కొడాలి నాని, మంత్రులు బొత్స సత్యనారాయణ, జోగిరమేశ్ ముఖ్యమంత్రికి స్వాగతం పలికినవారిలో ఉన్నారు. ఐజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, కలెక్టర్ రాజాబాబు జేసీ గీతాంజలిశర్మ తదితర ఉన్నతాధికారులు పుష్పగుచ్ఛాలు ఇచ్చారు. ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కార చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు సీఎం సూచించారు.



అనారోగ్య బాధితులకు చెక్కుల అందజేసిన అధికారులు

అనారోగ్య బాధితులకు ఆర్థిక సాయం చెక్కుల పంపిణీ

జిల్లావ్యాప్తంగా అనారోగ్యబాధితులకు అందాల్సిన ఫీజు రియింబర్స్‌మెంట్‌తో పాటు ఎన్వోసీలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్న బాధిత కుటుంబాలకు పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కలెక్టర్‌ను సీఎం ఆదేశించారు. సీఎం వెళ్లిన గంటవ్యవధిలో స్థానిక ప్రవేట్ ఫంక్షన్ హాల్‌లో 20బాధిత కుటుంబాలకు రూ.28లక్షల తక్షణ సాయం కింద ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కులను ప్రజాప్రతినిధులతో కలిసి కలెక్టర్ అందజేశారు.



పింఛన్ల పంపిణీలో వలంటీర్లతో స్వామిదాసు ప్రచారం

మద్దతు ఇవ్వకుంటే పింఛన్లు కట్!

» వలంటీర్లతో కలిసి అధికార వైసీపీ నేతల ఇంటింటి ప్రచారం..

తిరువూరు, మార్చి 1 : ఉమ్మడి కృష్ణా జిల్లాలో అధికారపార్టీ అభ్యర్థులు వలంటీర్లకు తాయిలాలు ఇస్తు తమకు అనుకూలంగా పనిచేయించుకునే ప్రయత్నం చేస్తుంటే, తిరువూరులో వైసీపీ సమన్వయకర్త నల్లగట్ల స్వామిదాసు వలంటీర్లతో కలిసి పింఛన్లు పంపిణీచేస్తు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండటం గమనార్హం. శుక్రవారం పట్టణంలోని 16వ వార్డులో వలంటీర్లు ఇంటింటికి వెళ్లి పింఛన్లు ఇచ్చే కార్యక్రమంలో ఉండగా స్వామిదాసుతో పాటుగా కొందరు వైసీపీ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. వచ్చే ఎన్నికల్లో తమకు మద్దతు ఇవ్వాలని, లేని పక్షంలో మీకు ఫింఛన్లు సక్రమంగా అందవని లబ్ధిదారులతో బెదిరింపు ధోరణిలో మాట్లాడటం గమనార్హం. పట్టణంలోని 16, 17 వార్డుల్లో టీడీపీ బలం అధికంగా ఉంది. మునిసిపల్ ఎన్నికల్లో ఈ రెండు వార్డుల్లో వరుసగా రెండుసార్లు టీడీపీ అభ్యర్థులు గెలుపొందారు. ఈ వార్డుల్లో పట్టుసాధించేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్న వైసీపీ నాయకులు చివరకు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో లబ్ధిదారుల్ని మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై 16వ వార్డు కౌన్సిలర్ జీడిమళ్ల సత్యవతి, టీడీపీ వార్డు అధ్యక్షుడు ఉదారపు మార్కేండేశ్వరరావు తదితరులు మునిసిపల్‌కమిషనర్ లోవరాజు, 9వ వార్డు సచివాలయంలో ఫిర్యాదు చేశారు. వలంటీర్లపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



జగనన్న విద్యాదీవెన చెక్కు అందజేస్తున్న కలెక్టర్ దిల్లీరావు

ఐదో విడత విద్యాదీవెన నిధులు ఎన్టీఆర్ జిల్లాలో రూ.31.72 కోట్లు విడుదల

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు

వన్‌టౌన్, మార్చి1 : ఎన్టీఆర్ జిల్లాలో ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, బీఎడ్, అగ్రికల్చరల్, మెడికల్, నర్సింగ్ విద్య అభ్యసిస్తున్న 37178 మందికి విద్యాదీవెన పథకం అందిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు తెలిపారు. 33602 మంది తల్లుల ఖాతాల్లో 2023 చివరి త్రైమాసికానికి గాను శుక్రవారం రూ31.72 కోట్లు నిధులు విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిరుపేద విద్యార్థులకు విద్యను అందించేందుకు సీఎం ప్రత్యేక చర్యలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు అవుతు శ్రీ శైలజారెడ్డి, బెల్లం దుర్గ, వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు షేక్ గౌస్ మొహుద్దీన్, భట్రాజ్ కార్పొరేషన్ ఛైర్ పర్సన్ కూరపాటి గీతాంజలి, జైన్ కార్పొరేషన్ ఛైర్మన్ మనోజ్ కోఠారి, సోషల్ వెల్ఫేర్ శాఖ డిప్యూటీ డైరక్టర్ వి.వి విజయశాంతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, డ్వామా పీడీ జే.సునీత తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ పోస్టర్ ఆవిష్కరణ

గవర్నర్‌పేట, మార్చి 1: మహిళా సమానత్వం సాధించిన నాడే దేశం ముందుకు పోతుందని కలెక్టర్ ఎస్.దిల్లీరావు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 10న ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో నిర్వహించే ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ పోస్టర్‌ను కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. మహిళల్లో నైపుణ్యాలను వెలికితీసేందుకు ఇలాంటి ఎగ్జిబిషన్లు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు స్వరూపరాణి, ఫోరం ఫర్ ఆర్టిస్ట్ సంస్థ అధ్యక్షుడు ఎ.సునీల్‌కుమార్, సభ్యులు ప్రియాంక, లలితాసౌజన్య, సేఫ్ సంస్థ ప్రెసిడెంట్ జి.జ్యోత్స్న పాల్గొన్నారు.

» జగనన్న కాలనీలు కాదు మురికివాడలు

» స్థలాల పేరుతో కోట్లు కొల్లగొట్టిన నేతలు

» డ్వాక్రా మహిళల పేరున రుణాలు

» ఓటీఎస్ పేరుతో పేదల దోపిడీ

» జగన్‌రెడ్డి క్షమార్హుడు కాదు

పేదల ఇళ్ల పేరుతో.. పక్కా మోసం!

- నెట్టెం రఘురాం ధ్వజం



జగ్గయ్యపేట, మార్చి 1 : పేదలకు ఇళ్లు, నివేశన స్థలాల పేరుతో జగన్‌రెడ్డి పేదలను పక్కాగా మోసం చేశారని, డ్వాక్రా మహిళల పేరున వేలకోట్లు రుణాలు తీసుకుని అప్పులు పాలు చేశాడని మాజీ మంత్రి, విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం ధ్వజమెత్తారు. పేదల ఇళ్లకు భారతీ సిమెంట్‌ను అంటగట్టి పేదల జీవితాలతో ఆడుకున్న జగన్‌రెడ్డి క్షమార్హుడు కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం తన నివాసంలో విలేకర్లతో నెట్టెం మాట్లాడుతూ, సంవత్సరానికి 5లక్షలు ఇళ్లు కడతానన్న జగన్‌రెడ్డి 3లక్షల ఇళ్లు కూడా నిర్మించలేదని ఆరోపించారు. ఇళ్ల నిర్మాణానికి కేంద్రం ఇచ్చిన రూ.1.80లక్షలకు తోడు రాష్ట్ర ప్రభుత్వం చిల్లిగవ్వ కూడా ఇవ్వకుండా ఇళ్లు కట్టుకోవాలని లబ్ధిదారులను బెదిరించటంతో వారు అప్పుల పాలయ్యారన్నారు. డ్వాక్రా మహిళల పేరున రూ.35 వేలు చొప్పున రూ.3500 కోట్లు తెచ్చి ఏం చేశారని, టిడ్కో ఇళ్ల పేరు చెప్పి బ్యాంకు రుణాలు తెచ్చి లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వకుండా రెండు రకాలుగా నష్టపెట్టారని ఆరోపించారు. భారతీ సిమెంట్స్ బస్తాకు రూ.100 అధికంగా అంటగట్టి కోట్లు దండుకున్నారని, నాణ్యత లేని సిమెంటు వల్ల ఇళ్లు కూలిపోతున్నాయని ఆరోపించారు. ఓటీఎస్ పేరుతో కోట్లు వసూలు చేశాడని ఆరోపించారు. దేశంలో ఎన్టీఆర్ పేదలకు పక్కా గృహ పథకాన్ని ప్రారంభించి ఆదర్శంగా నిలిస్తే, చంద్రబాబు నూతన టెక్నాలజీతో టిడ్కో ఇళ్లను నిర్మించారని చెప్పారు. జగనన్న కాలనీలకు చెరువు ముంపు, పొరంబోకు, పల్లపు భూములు సేకరించారని, అనేక చోట్ల భూమి కొనుగోలు పేరుతో లక్షల కోట్లను ఆ పార్టీ ఎమ్మెల్యేలు దోచుకున్నారని ధ్వజమెత్తారు. పేదల పథకాలలో లక్షలకోట్లు అవినీతికి పాల్పడ్డ ప్రభుత్వానికి ఎంత మాత్రం అధికారంలో కొనసాగే నైతిక అర్హత లేదన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు ముల్లంగి రామకృష్ణారెడ్డి, కన్నెబోయిన రామలక్ష్మీ, గద్దె రాజ్యలక్ష్మీ, గింజుపల్లి రమేష్, అన్వర్, సంకా వెంకట్రావు, భాస్కర్, తాళ్లూరి వెంకటేశ్వర్లు, మొగలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తల పోరాటమే గెలుపునకు నాంది : రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మార్చి 1 : వైసీపీ అవినీతి అక్రమాలపై టీడీపీ, జనసేన కార్యకర్తలు సైనికుల్లా పోరాడితే గెలుపు సునాయాసమని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర అన్నారు. శుక్రవారం రాత్రి నియోజకవర్గ కార్యాలయ ఆవరణలో శంఖారావం సన్నాహక విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, తాడేపల్లి గూడెం సభ తరువాత వైసీపీలో వణుకు పుట్టిందన్నారు. ఎన్నికలు 15 రోజులు ఉండగా టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు ఇస్తున్నారని, శంకుస్థాపనలు మొదలు పెట్టారని అన్నారు. ఐదేళ్లుగా ప్రజల కష్టాలు ఇన్నీ అన్నీ కావన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్య, గొర్రెపాటి గోపీచంద్, మోటమర్రి బాబా ప్రసాద్, ఎండి ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు, కుంచే నాని తదితరులు పాల్గొన్నారు.

నాని ప్రజల విశ్వాసం కోల్పోయాడు : వెనిగండ్ల

గుడివాడ : ఎమ్మెల్యేగానే కాకుండా రాజకీయ నాయకుడిగా కొడాలి నాని ప్రజల విశ్వాసాన్ని కోల్పోయాడని, కేవలం సీటు కోసమే చంద్రబాబు, పవన్‌లను నోటికి వచ్చినట్టు తిడుతున్నాడని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము ఆరోపించారు. శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నిత్యం రాజకీయ విమర్శలు చేసే నాని గుడివాడ అబివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. నాని తన 20ఏళ్ల పదవీకాలంలో వెనక్కి తిరిగిచూసుకుంటే లక్షల కొద్ది బూతులు, కొండంత అవినీతి తప్ప అభివృద్ధి మచ్చుకైనా లేదన్నారు. నాని అవినీతి చిట్టా లోకేశ్ రెడ్‌బుక్‌లో నమోదై ఉందని, చిన్నప్పుడు తాగిన ఉగ్గుపాలతో సహా కక్కాల్సిన సమయం ఎంతో దూరంలో లేదన్నారు. రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో, నియోజకవర్గంలో ప్రభుత్వ ప్రజా సంపదను అడ్డగోలుగా దోచుకున్న నాని, గడ్డంగ్ గ్యాంగ్‌లు ఖచ్చితంగా ఊచలు లెక్కపెట్టాల్సిందేనన్నారు. జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ, ప్రజల గుండెల్లో ఉన్న చంద్రబాబు, పవన్‌లను విమర్శించే అర్హత నానికి లేదన్నారు. పవన్ ఆదేశాలను తు.చా తప్పక పాటిస్తామని స్పష్టం చేశారు.



వైసీపీ శ్రేణులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న వెనిగండ్ల, రావి

టీడీపీలోకి భారీగా చేరికలు

బీసీ నాయకుడు మరీదు రాహుల్ ఆధ్వర్యంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము సమక్షంలో శుక్రవారం 17వ వార్డుకు చెందిన వైసీపీ నేతలు, కార్యకర్తలు 300 మంది పార్టీలో చేరారు. రాహుల్ చేరికతో 17వ వార్డు మరింత బలోపేతమైందని వెనిగండ్ల అన్నారు. యలవర్తి శ్రీనివాసరావు, దింట్యాల రాంబాబు, గోకవరపు సునీల్, జి.సత్యనారాయణ, యార్లగడ్డ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన పార్టీలకు ఘోరీ కడదాం

» ప్రత్యేకహోదా సాధించలేని ఎంపీలు రాజీనామా చేయాలి

» కేసులకు భయపడి కేంద్రానికి సాగిలపడుతున్న సీఎం జగన్

» విద్యార్థి, యువజన సంఘాల నేతలు

ధర్నాచౌక్, మార్చి 1 : ప్రత్యేక హోదా అంశంలో ప్రజలను మోసం చేస్తున్న పార్టీలకు రానున్న ఎన్నికల్లో ఘోరీ కడదామని, రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్లమెంట్ సభ్యులు రాజీనామ చేయాలని పలువురు నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా తీసుకురావడం చేతకాని ఎంపీలు రాజీనామ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం దాసరి భవన్ నుంచి సీఎం కార్యాలయానికి బయలుదేరిన నేతలను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని బీజేపీ ప్రభుత్వం, కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తామని వైసీపీ ప్రభుత్వం ప్రజలను మోసం చేశాయని ధ్వజమెత్తారు. అమ్మ పెట్టదు... అడుక్కు తిననివ్వదు అన్న చందంగా ప్రత్యేకహోదా అడగరు, అడిగేవారిని అరెస్టు చేస్తారని ఎద్దేవా చేశారు.



ఆందోళనకారులను వాహనంలో ఎక్కించి స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

తనపై ఉన్న కేసుల భయంతో సీఎం జగన్ కేంద్రానికి సాగిలపడుతున్నారని విమర్శించారు. పోలీసులతో ఉద్యమాలను అణచలేరని, రానున్న రోజుల్లో తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు, వి.జాన్సన్‌బాబు, కె.శివారెడ్డి, లంకా గోవిందరాజులు, సింగంశెట్టి మోహన్‌ప్రసాద్, కె.కార్తీక్, గాడి అజయ్, సాయికుమార్, రాజేంద్ర తదితరులు పోలీసులు అరెస్టు చేసిన వారిలో ఉన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, తదితరులు

7న పీబీ సిద్ధార్థలో బ్లిట్జ్ క్రీగ్

మొగల్రాజపురం, మార్చి 1: పీబీ సిద్ధార్థ కళాశాల స్టూడెంట్స్ అసోసియేషన్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదిన కళాశాలస్థాయిలో బ్లిట్జ్‌క్రీగ్-2024 అంతర్రాష్ట్ర పోటీలు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తెలిపారు. కళాశాలలో శుక్రవారం ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయడానికి పోస్టర్ ప్రజంటేషన్, కంప్యూటర్ క్విజ్, కోడింగ్ అండ్ డీకోడింగ్, డేటాథాన్, స్పాట్ ఫొటోగ్రఫీ, నిధి అన్వేషణ, సంగీత వాయిద్యాల పోటీలు, మిస్టర్ అండ్ మిస్, షార్ట్ ఫిల్మ్ పోటీలు ఉంటాయన్నారు. అనంతరం పోస్టర్ విడుదల చేశారు. డైరెక్టర్ వేమూరి బాబూరావు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ రవికిరణ్ పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై అధికారుల దాడి.. మూడు యంత్రాల సీజ్

గన్నవరం, మార్చి 4 : గుట్టుచప్పుడు కాకుండా సాగిస్తున్న అక్రమ తవ్వకాలపై మైనింగ్ అధికారులు దాడులు నిర్వహించి మూడు యంత్రాలను సీజ్ చేశారు. మండలంలోని కొండపావులూరు పంచాయతీ శివారులోని దుబ్బులగుంట చెరువులో అధికార పార్టీ నేత అండతో యథేచ్ఛగా తవ్వకాలు సాగిస్తున్నారన్న సమాచారం మేరకు శుక్రవారం మైనింగ్ అధికారి శివపార్వతి ఆధ్వర్యంలో సిబ్బంది దాడిచేసి మూడు ఎక్స్‌కవేటర్‌లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. తవ్వకాలు జరిగిన చెరువును మైనింగ్ ఏడీ పరిశీలన చేశారు. అనర్హత వేటుకు గురైన ఎమ్మెల్యే వంశీ, ఆయన అనుచరుల అండదండలతో సాగుతున్న తవ్వకాలపై దాడికి వెళ్లిన అధికారులను అక్కడ ఉన్నవారు ప్రతిఘటించే ప్రయత్నం చేశారు. అధికారులు ఎక్స్‌కవేటర్లను సీజ్ చేసి గన్నవరం స్టేషన్‌లో అప్పగించారు. తవ్వకాలపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించినట్టు తెలిసింది. గ్రామస్థులు ఇప్పటికే జిల్లా కలెక్టర్, మైనింగ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా.. దీనిలో భాగంగానే శుక్రవారం దాడులు జరిగాయి.



రబీ పంట నమోదు ముసాయిదా జాబితా సిద్ధం

లబ్బీపేట, మార్చి1 : రబీ సీజన్లో విత్తిన పంటలను ఇ-క్రాప్‌లో నమోదు చేసి బయోమెట్రిక్ ధృవీకరణ పూర్తి అయిన ముసాయిదా జాబితాలను సామాజిక తనిఖీ నిమిత్తం రైతు భరోసా కేంద్రాలలో ఈ నెల 3వ తేదీ వరకు ప్రదర్శించడం జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారిణి ఎస్.నాగమణమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాను గ్రామ సభలు నిర్వహించి పేర్లను రైతులకు చదివి వినిపించడం జరుగుతుందని, పంట నమోదులో ఎటువంటి తప్పులున్నా రైతులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదులను అందజేస్తే వాటిని పరిశీలించి దిద్దుబాటు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏవైనా తప్పులు దొర్లితే దరఖాస్తు రూపంలో సంబంధిత గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కొత్త, దిద్దుబాటు చేసిన రికార్డ్స్ ను వీఆర్వో వీఏఏ, వీహెచ్ఏ నిర్ధారణ, ఆమోదానికై మండల వ్యవసాయ అధికారికి తహసీల్దార్‌కు పంపడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రక్రియ ఈ నెల 5వ తేదీ లోగా పూర్తి చేయడం జరుగుతుందని, ఆమోదం పొందిన తరువాత తుది జాబితా ఈ నెల 8న అన్ని రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ దిల్లీరావు, అధికారులు

పోలింగ్ కేంద్రాల్లో విస్తృత స్థాయిలో మౌలిక సౌకర్యాలు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు

వన్‌టౌన్, మార్చి1 : ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 1781 పోలింగ్ కేంద్రాలు, విజయవాడ రూరల్‌లో భాగమైన గన్నవరం నియోజకవర్గానికి చెందిన 82 పోలింగ్ కేంద్రాలతో కలిపి మొత్తం 1863 పోలింగ్ కేంద్రాలలో విస్తృతస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు తెలిపారు. శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఎన్నికల ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ నుంచి పాల్గొన్న కలెక్టర్ దిల్లీరావు మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణకు ప్రణాళిక బద్ధంగా అన్ని చర్యలను తీసుకుంటున్నట్టు తెలిపారు. తుది ఓటర్ల జాబితా ప్రకటించిన నాటినుంచి ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. ప్రతికూల వార్తల పరిష్కార నివేదికను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించినట్టు చెప్పారు. జిల్లా కంట్రోల్‌రూమ్‌లో సంబంధిత మెటీరీయల్‌ను సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్‌పుండ్కర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

ఈయూ పోరాటాల ఫలితమే ఏఏఎస్

బస్‌స్టేషన్, మార్చి 1 : ఎంప్లాయీస్ యూనియన్(ఈయూ) చేసిన పోరాటాల ఫలితంగానే ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీం(ఏఏఎస్) సాధ్యమైందని యూనియన్ నేతలు పేర్కొన్నారు. ఏఏఎస్ కలిపేందుకు ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో విద్యార్హతల్లో సడలింపు చేసినందుకు ఆర్టీసీ యాజమాన్యానికి శుక్రవారం కృతజ్ఞతలు తెలుపుతూ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నర్సయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. ఎండీ ద్వారకా తిరుమలరావు ఆదేశాలకు అనుగుణంగా అడ్మిన్ ఈడీ కేఎస్ బ్రహ్మానందరెడ్డి ఉత్తర్వులు జారీచేశారని, దీనివల్ల ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు చేకూరతాయని పేర్కొన్నారు.

కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా శోభన్‌బాబు

మచిలీపట్నం టౌన్, మార్చి 1 : కృష్ణా విశ్వవిద్యాలయం నూతన రిజిస్ట్రార్‌గా ఆచార్య కె.శోభన్ బాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నరసరావుపేట జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్‌గా మేథమెటిక్స్ విభాగం హెచ్‌వోడీగా పనిచేస్తున్న శోభన్‌బాబు ఇక్కడ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం, కాకినాడ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలల్లో సహాయ ఆచార్యులుగా పనిచేశారు. అలాగే విజయనగరం కళాశాలలో సహ ఆచార్యులుగా విధులు నిర్వహించారు. కాకినాడ జవహర్‌లాల్ నెహ్రూ బీటెక్ కో-ఆర్డినేటర్, జవహర్‌లాల్ నెహ్రూ పరీక్షల విభాగం అడిషనల్ కో-ఆర్డినేటర్‌గా పనిచేశారు. శోభన్‌బాబును విశ్వవిద్యాలయంలోని అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.



కేయూ వీసీ జ్ఞానమణిని కలిసిన శోభన్‌బాబు



నాక్-ఎ గుర్తింపు చూపుతున్న కళాశాల కార్యదర్శి

వీకేఆర్ అండ్ వీఎన్‌బీకి నాక్-ఎ గుర్తింపు

గుడివాడ : స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బి ఇంజినీరింగ్ కళాశాలకు నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడియేషన్ కౌన్సిల్, బెంగుళూరు వారు నాక్-ఎ గుర్తింపునిచ్చారు. శుక్రవారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కళాశాల కార్యదర్శి వేములపల్లి కోదండరామయ్య మాట్లాడుతూ, గత ఏడాది డిశంబరు 14, 15 తేదీల్లో నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడియేషన్ కౌన్సిల్, బెంగుళూరు త్రిసభ్య కమిటీ కళాశాల నాణ్యత ప్రమాణాలు, విద్యాబోధన, ప్రయోగశాలలు, విద్యార్థులకు ఉద్యోగ అవకాశాల కల్పన, గ్రంథాలయం వంటి వాటిని రెండు రోజుల పాటు నిశితంగా పరిశీలించి నాక్-ఎ గుర్తింపును యిచ్చారన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కళాశాల డైరెక్టర్ బి.కళ్యాణ్‌కుమార్, ప్రిన్సిపాల్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరమశివునికి నూలు పాగా

పెడన, మార్చి 1 : పరమ శివభక్తుడైన చేనేత కార్మికుడు వరదా సోమేశ్వరరావు తన చేనేత మగ్గంపై శివదేవునికి నూలు పాగా తయారు చేశాడు. అత్యంత నియమనిష్ఠలతో రేయింబవళ్లు శ్రమించి సోమేశ్వరరావు తన ఇష్టదైవమైన పరమేశ్వరుడి కోసం ఈ పాగా తయారు చేశాడు. ఈ పాగాను మహాశివరాత్రి నాడు లింగోద్భవ సమయంలో పాలకొల్లులోని క్షీరరామలింగేశ్వరస్వామికి సమర్పిస్తానని సోమేశ్వరరావు పేర్కొన్నాడు. స్వామికి శివరాత్రి రోజున నూలు పాగా సమర్పించడం తమ వంశస్తులకు ఆనవాయితీగా వస్తోందని చెప్పారు.



బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	137, 146, 157
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.75

గద్దె రామ్మోహన్ విజయం తథ్యం: జనసేన

పటమట, మార్చి 1 : త్వరలో జరగనున్న అసెంబ్లీల్లో ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గ టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న గద్దె రామ్మోహన్ అత్యధిక మెజార్టీతో హ్యాట్రిక్ విజయం సాధించడం తథ్యమని జనసేన నాయకులు పేర్కొన్నారు. అశోక్‌నగర్‌లోని శాసనసభ్యుని కార్యాలయంలో శుక్రవారం జనసేన నాయకులు గద్దె రామ్మోహన్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో విధ్వంసాలను వాటితో పాటు 2024 ఎన్నికల్లో గెలిచిన తర్వాత టీడీపీ-జనసేన సంకీర్ణ ప్రభుత్వంలో అమలు చేసే సంక్షేమ పథకాల గురించి ఉభయ పార్టీల కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. జనసేన నాయకులు మాట్లాడుతూ గద్దెను ఎమ్మెల్యేగా 50 వేల ఓట్లకు ఒక్క ఓటు తక్కువ కాకుండా మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు.

యుద్ధానికి సంసిద్ధంకండి

మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఈడుపుగల్లు (కంకిపాడు), మార్చి 1 : అధికార పార్టీ అరాచక పాలనకు వ్యతిరేకంగా యుద్ధానికి తెలుగుతమ్ముళ్లు సంసిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని ఈడుపుగల్లులో దేవినేని రాజా ఆధ్వర్యంలో బూత్ కమిటీ చైర్మన్లు, సభ్యులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్ మాట్లాడుతూ, కష్టపడి పనిచేస్తే ఎన్నికల్లో గెలుస్తామని, డబ్బులు పనిచేయవన్నారు. 2019 ఎన్నికల్లో ఓటమి తరువాత కూడా ఖాళీగా కుర్చోకుండా ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలపై పోరాటం చేశామని, అధికారంలో ఉన్నా..ప్రతిపక్షంలో ఉన్నా బూత్ కన్వీనర్ల పాత్ర కీలమన్నారు. ముఖ్యమంత్రి జగన్ కుటిల రాజకీయాలు చేస్తూ మాజీ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడును జైల్లో పెట్టినా టీడీపీ నాయకులు, కార్యకర్తలు చంద్రబాబు వెంటే ఉన్నారని, 175 నియోజకవర్గాల్లో ఏ నియోజకవర్గం అభ్యర్థులకు లేని టెక్నాలజీ మన నియోజకవర్గంలో ఉందని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ ఇంటింటికి తిరుగుతూ ఓటర్ వెరిఫికేషన్ చేయాలన్నారు. ప్రతి ఇంటిని సంచరిస్తూ ప్రజ లతో మమేకమవ్వలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలతో పాటు సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ఉన్నాయని కార్యకర్తలు అప్రమ త్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, సర్పంచ్ పందిపాటి ఇందిర, మండల పార్టీ అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర, మద్దాలి సాయిబాబు, షేక్ షకార్, షేక్ మాబు సుబాని, సుధాకర్, చిన్న బాబు, చెల్లి సంగీతరావు, రాయుడు, హరీష్, గోపి, పుట్టగుంట రవి, వణుకూరు విక్రం, అనుమోలు రామకృష్ణ, సుంకర శ్రీహరి, పులి శ్రీను, చలవాది రాజ, నాగరాజు, వెంకటేశ్వరరావు, కాసరనేని కరుణ, మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఈడుపుగల్లులో టీడీపీ ప్రచార క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్, దేవినేని

ఓటర్ల జాబితాపై సమీక్ష

పెనమలూరు : ఎన్నికలు సమీపిస్తున్న వేళ మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ టీడీపీ క్లస్టరు, యూనిట్ ఇన్‌చార్జిలతో భవిష్యత్తు కార్యాచరణ, ఓటర్ల జాబితాలపై చర్చించారు. రానున్న ఎన్నికల్లో ఓటర్ల జాబితాల వెరిఫికేషన్ చాలావరకు పూర్తి చేశామని, ఇంకనూ ఓటర్ల జాబితాలో సవరణలకు అవకాశం ఉన్న దృష్ట్యా ఓటర్ల జాబితాల్లో మార్పు చేర్పులపై అప్రమత్తంగా ఉండా లని సూచించారు. అధికార పక్షం చేసే అక్రమాలపై ఒక కన్నేసి ఉంచాలని, పార్టీ కార్యాలయం నుంచి వచ్చిన టేబుల్ క్యాలెండర్లను ఇంటింటికీ పంచాలని కోరారు. కార్యక్రమంలో అనుమోలు ప్రభాకరరావు, శుభశేఖర్, తుమ్మల రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైకోను ఓడించాలి

టీడీపీ నాయకుడు దేవినేని గౌతమ్

పెనమలూరు, మార్చి 1 : రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో భ్రష్టు పట్టించిన సైకో జగన్‌రెడ్డిని ఓడించడమే ధ్యేయంగా పనిచేద్దామని టీడీపీ నాయకుడు దేవినేని గౌతమ్, స్మిత దంపతులు పిలుపునిచ్చారు. శుక్రవారం పెనమలూరులో జరిగిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో వారు పాల్గొని ప్రజలతో మాట్లాడారు. షుమారు పాతికేళ్ల వెనుకబాటుకు గురైన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టగల ఏకైక వ్యక్తి చంద్రబాబు మాత్రమేనన్నారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిగా ఎన్నుకొందామని పిలుపునిచ్చారు.



పెనమలూరులో టీడీపీ మేనిఫెస్టోను ప్రచారం చేస్తున్న దేవినేని గౌతమ్, స్మిత దంపతులు

టీడీపీ నేత సత్తార్‌కు పరామర్శ



సత్తార్‌ను పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

విజయవాడ రూరల్, మార్చి 1 : అనారోగ్యంతో ఇటీవల శస్త్ర చికిత్స చేయిం చుకుని ఇంటికి వచ్చిన సీనియర్ టీడీపీ నేత పఠాన్ సత్తార్‌ను టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దండు సుబ్రహ్మణ్యంరాజు శుక్రవారం పరామర్శించారు. నున్న లోని సత్తార్ ఇంటికి వెళ్లిన టీడీపీ నేతలు ఆయనతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. పరామర్శించిన వారిలో గంపా శ్రీనివాస్ యాదవ్, ఈడే పోతురాజు తదితరులు ఉన్నారు.

పూడికతీత పనుల పరిశీలన

ఈడుపుగల్లు (కంకిపాడు), మార్చి 1 : మురుగు పొంగి పొర్లుతున్న పలు ప్రధాన డ్రెయినేజీల పూడికతీత పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ పందిపాటి ఇందిర తెలిపారు. ఈడుపుగల్లు - పునాదిపాడు డొంక రోడ్డులోని డ్రెయినేజీ పూడికతీత పనులు శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ పందిపాటి ఇందిర మాట్లాడుతూ, ఈడుపుగల్లులో పలు డ్రెయిన్లలో మురుగు పొంగి పొర్లుతుందన్నారు. దీంతో ఓ పక్క రైతులు, మరో పక్క స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీంతో డ్రెయినేజీ అభి వృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమం లో స్థానిక పెద్దలు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా నుంచి

మృతుల ఓట్లు తొలగించాలి



టీడీపీ నేతలు ఇచ్చిన వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

గన్నవరం, మార్చి 1 : ఓటరు జాబితా నుంచి మృతి చెందిన వారి ఓట్లను వెంటనే తొలగించాలని టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ కో-ఆర్డినేటర్ ఆళ్ల గోపాల కృష్ణ అన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా పరిష్కరించాలని కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకుల సమావేశం శుక్రవారం తహసీల్దార్ ఎన్ఎస్ పవన్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. పోలింగ్ కేంద్రాల మార్పుల ప్రతిపాదన, ఓటరు దరఖాస్తు జాబితా వివరాలను తెలియజేశారు. గోపాల కృష్ణ మాట్లాడుతూ, గత నెల 22 నుంచి ఇప్పటి వరకూ వివిధ స్థాయిలలో ఓటర్లు సమర్పించిన చేర్పులకు సంబం ధించి ఫారం-6 దరఖాస్తులు 419, ఫారం-7 దరఖాస్తులు 3,262, పేరు అడ్రస్సు మార్పులకు సంబంధించి 1,150 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని త్వరిత గతిన పరిష్కరించాలన్నారు. ఎంపీపీ, జిల్లా పరిషత్ పాఠశాలల, కమ్యూనిటీ, పంచాయతీ భవనాలకు వైసీపీ ప్రభుత్వం అధికార పార్టీ రంగులు వేసి సీఎం జగన్‌ను కీర్తిస్తూ స్లోగన్స్ రాసి ఉన్నాయని వెంటనే తొలగించాలని యార్లగడ్డ రాసిన వినతిపత్రాన్ని అందజేశారు. తంగిరాల శ్రీనివాసరావు (టీడీపీ), సుంకర వీరభద్ర ప్రసాద్ (కాంగ్రెస్), నీలం ప్రవీణ్‌కుమార్ (వైసీపీ), కైలే ఏసుదాస్ (సీపీఎం), ఎన్నికల డీటీ ఏఎస్ఆర్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ పథకాలతో పేదల అభ్యున్నతి

హనుమాన్‌జంక్షన్, మార్చి 1 : టీడీపీ మేనిఫెస్టోను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి గన్నవరం నియోజకవర్గం టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు గెలుపుకోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. శుక్రవారం స్థానిక పట్టణ టీడీపీ కార్యాలయంలో పట్టణ ముఖ్య కార్య కర్తల సమావేశం పట్టణ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు రూపొందించిన సూపర్ సిక్స్ పథకాలతో పేదల అభ్యున్నతి దాగి ఉందన్నారు. గడప గడపకు సూపర్ సిక్స్ పథకాలను తీసుకెళ్లాలని సూచించారు. టీడీపీ తెలుగు మహిళ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి మాట్లాడుతూ, వైసీపీ అరాచక పాలనతో ప్రజలు విసిగిపోయి ఉన్నారన్నారు. చంద్రబాబు నాయకత్వంలో టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేసి నియో జకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావును అత్యధిక మెజారిటీతో గెలిపించడానికి కృషి చేద్దామన్నారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి వడ్డిల్లి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దయాల రాజేశ్వరరావు

వర్గీకరణ వ్యతిరేక శక్తులను అడ్డుకుంటాం

విజయవాడ రూరల్, మార్చి 1 : మహజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో విజయవాడ రూరల్ మండలం నున్నలో మాదిగ అమరవీరుల సంస్మరణ సభ శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎమ్మెస్పీ నాయకుడు మంద వేణు ముందుగా ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణాలు పొగొట్టుకున్న మాదిగ అమర వీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక శక్తులను మట్టి కరిపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మాదిగ ఉద్యోగుల సంఘం నాయకుడు విక్టర్‌బాబు, తగరం విజయ్‌కుమార్, కోట కుమార్, దేవదాసు, శిఖామణి పాల్గొన్నారు.



నున్నలో అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటున్న నేతలు

పాడిరైతు కుటుంబాలకు సహకారం

●కృష్ణామిల్క్‌యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 1 : పాడిరైతు కుటుంబాల ఆర్థికాభి వృద్ధికి కృష్ణామిల్క్ యూనియన్ అన్నివిధాలా సహకారమందిస్తుందని చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. వీరవల్లికి చెందిన పాడిరైతు కలపాల శ్రీధర్ కుమారుడు శ్రీరుషి కల్యాణం సందర్భంగా శుక్రవారం కల్యాణమస్తు బంగారు నాణేన్ని అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాడిరైతు కుటుంబాల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా కృష్ణామిల్క్‌యూనియన్ ద్వారా అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కసుకుర్తి నిరంజనరావు, తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి గుండపనేని ఉమావరప్రసాద్, మేనేజర్ కిలారు కిరణ్‌కుమార్, పాలకవర్గ సభ్యుడు అర్వపల్లి సీతారామయ్య, సూపర్‌వైజర్ గోపాల్, రామచంద్రరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పెళ్లికుమారుడికి కల్యాణమస్తు కానుక అందజేస్తున్న చలసాని

ముగిసిన ఆలయ కమిటీ పదవీకాలం

హనుమాన్‌జంక్షన్, మార్చి 1 : స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయ పాలక మండలి సభ్యుల పదవీకాలం శుక్రవారంతో ముగిసింది. నెరుసు నాగభూషణం చైర్మన్‌గా పాలక మండలి గడిచిన రెండేళ్లు పాటు ఆలయ బాధ్యతలు నిర్వహించారు. నోటిఫికేషన్ వెలువడిన తరువాత నూతన పాలక మండలి ప్రతిపాదనలు పంపించడం జరుగుతుందని ఈవో కె. శ్రీనివాస్ తెలిపారు.

ఘనంగా వెలగపూడి జన్మదినం



వెలగపూడి శంకరబాబును సత్కరిస్తున్న బోడె ప్రసాద్

పెనమలూరు, మార్చి 1 : టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. టీడీపీ నాయకులు, అభిమానులు శంకరబాబుకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సమక్షంలో కానూరు టీడీపీ కార్యాలయంలో శంకరబాబు జన్మదిన కేకును కోసి శుభాకాంక్షలు తెలిపారు. అభిమానులకు మిఠాయిలు పంచి పెట్టారు. పలువురు నేతలు శంకరబాబును దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా శంకరబాబు, బోడె ప్రసాద్, అనుమోలు ప్రభాకరరావు, యార్లగడ్డ సుచిత్రలు పార్టీశ్రేణులతో మాట్లాడుతూ, సైకో జగన్‌ను రాష్ట్రం నుంచి పారదోలడమే చంద్రబాబుకు అసలైన బహుమతి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో షేక్ బుజ్జి, వేగే పూర్ణయ్య, సంగెపు రంగారావు, మొక్కపాటి శ్రీనివాస్, శొంఠి శివరాంప్రసాద్, టీడీపీ రెహమాన్, వీరంకి కుటుంబరావు, బలగం కొండ, పాదాల ప్రభాకర్, మాదు శోభన్, కాట్రగడ్డ లీలాప్రసాద్, మల్లంపాటి విజయలక్ష్మి, వల్లూరు అన్నపూర్ణ, రియాజ్, సమీర్, పండల రజిని తదితరులు పాల్గొన్నారు.

అష్టలక్ష్మి ఆలయంలో విశేష పూజలు

గుడివాడ రూరల్ : చిన ఎరుకపాడులోని అష్టలక్ష్మి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకోగా అర్చకులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



ఉన్నత విద్యలో సంస్కరణలపై సదస్సు నేడు

గుడ్లవల్లేరు : శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ కె.రామమోహనరావు శనివారం విచ్చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్ తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో యు వత సాధికారత సాధించేందుకు ఉన్నత విద్యలో సంస్కరణలు అనే అంశంపై సదస్సులో ప్రసంగిస్తారన్నారు.

వీరమ్మతల్లిని దర్శించుకున్న యార్లగడ్డ

ఉయ్యూరు, మార్చి 1 : తెలుగుదేశం పార్టీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు కుటుంబ సభ్యులతో కలసి శుక్రవారం వీరమ్మతల్లిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. తిరునాళ్లలో అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన యార్లగడ్డకు ఆలయం వద్ద టీడీపీ నాయకులు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొలిచేవారి కొంగు బంగారమైన వీరమ్మతల్లిని తిరునాళ్లలో లక్షలాది మంది భక్తులు దర్శించి మొక్కులు తీర్చుకుంటారని, అమ్మవారి చల్లని దయతో రాష్ట్రం పాడి పంటలతో తులతూగి అభివృద్ధి పథంలో నడవాలని, ప్రజలు సుఖశాంతులతో జీవించేలా కరుణ చూపాలని కోరుకున్నట్టు తెలిపారు.



వీరమ్మతల్లిని దర్శించుకుంటున్న యార్లగడ్డ వెంకట్రావు, కుటుంబ సభ్యులు

తిరునాళ్లకు తరలివస్తున్న భక్తులు



వీరమ్మతల్లికి మొక్కులు సమర్పిస్తున్న భక్తులు

వీరమ్మ తిరునాళ్లకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. తిరునాళ్లలో 12వ రోజైన శుక్రవారం వేకువజామునుంచి డప్పువాయిద్యాల నడుమ గొర్రె పొటేళ్లు, చీర సారెలతో సందడిగా వచ్చి ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు తయారు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. సోమవారంతో తిరునాళ్ల ముగియనున్న నేపథ్యంలో మొక్కులు తీర్చుకునేందుకు పలు ప్రాంతాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారు. ఎండను లెక్కచేయక పొడవాటి క్యూల్లో నిలుచుని అమ్మవారిని దర్శించి మొక్కు తీర్చుకుంటున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	137, 146, 157
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.75

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి వెండి నాగపడగ



మోపిదేవి : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి నరసరావుపేటకు చెందిన అనుమోలు జగదీష్ కుమార్ వెండి నాగ పడగను సమర్పించారు. . శుక్రవారం స్వామివారిని దర్శించున్న అనంతరం 570 గ్రాముల వెండితో తయారు చేసిన పడగను ఆలయ ఉద్యోగులకు అందజేశారు. స్వామివారి చిత్ర పటం, ప్రసాదాలు దాతలకు అందజేశారు.

విక్కుర్తికి జనసైనికులు, వీర మహిళల మద్దతు



అవనిగడ్డ : అవనిగడ్డ నుంచి జనసేన పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న విక్కుర్తి శ్రీనివాస్‌ను శుక్రవారం అవనిగడ్డ, చల్లపల్లి మండలాల జనసైనికులు, వీర మహిళలు కలిసి తమ మద్దతు తెలియజేశారు. నియోజకవర్గంలో ప్రధానంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కార మార్గాలు చర్చించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థిని గెలిపించేందుకు కృషి చేయాలని జనసైనికులు, వీర మహిళలకు సూచించారు. నాగాయలంక, కోడూరు మండలాల మత్స్యకారులు సైతం విక్కుర్తి శ్రీనివాస్‌ను శుక్రవారం సాయంత్రం కలిశారు.

మాదిగ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

గుడివాడ : టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడిన కొద్దిరోజుల్లోనే మాదిగల సమస్యలను పరిష్కరించే దిశగా ఐకమత్యంగా ముందుకు సాగాలని దళిత నాయకులు కంచర్ల సుధాకర్, కొదమల గంగాధర్ పిలుపునిచ్చారు. టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఈనెల 9వ తేదీన జరిగే మాదిగల ఆత్మీయ సమ్మేళనం సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. మాదిగ, మాదిగ ఉపకులాలు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. దళిత నాయకులు గుడివాడ జోన్స్, అద్దంకి కమల్, ఇంటూరి గజేంద్ర, అద్దంకి మాణిక్యాలరావు, కొడాలి బాబు, బుల్లాకింగ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సాధన సభను విజయవంతం చేయండి

అవనిగడ్డ రూరల్ : ఎన్నికల తరుణంలో నరేంద్ర మోదీ ఏపీకి ఇచ్చిన ప్రత్యేక హోదా హామీని తక్షణమే అమలు చేయాలని కోరుతూ పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల ఆధ్వర్యంలో నిర్వహించే న్యాయ సాధన సభను విజయవంతం చేయాలని నియోజకవర్గ కన్వీనర్ అందె శ్రీరామ్మూర్తి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తానని హామీ ఇచ్చిన మోదీ దశాబ్ద కాలం గడిచినా నెరవేర్చలేదన్నారు. షర్మిల నిర్వహిస్తున్న న్యాయసాధన సదస్సుకు తిరుపతి వెళ్లనున్నట్లు తెలిపారు.

చేనేత కళాకారులను ప్రోత్సహించాలి



మచిలీపట్నం టౌన్ : చేనేత హస్తకళలను ప్రోత్సహించాలని మేయర్ వెంకటేశ్వరమ్మ అన్నారు. భావనారుషి చేనేత హస్తకళా కార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మచిలీపట్నంలో చేనేత హస్తకళా ప్రదర్శనను ప్రారంభించారు. 17 రోజుల పాటు జరిగే ప్రదర్శనలో చేనేత వస్త్రాలతో పాటు కలంకారీ, పోచంపల్లి, ఉప్పాల, వెంకటగిరి, గద్వాల్, మంగళగిరి ప్రదర్శించారు.

తృణమూల్ దుశ్చర్యలను ఖండిస్తూ బీజేపీ నిరసన

మచిలీపట్నం టౌన్ : పశ్చిమబెంగాల్‌లో తృణముల్ కాంగ్రెస్ దుశ్చర్యలను ఖండిస్తూ శుక్రవారం కోనేరుసెంటర్‌లో బీజేపీ నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ రాజాబాబు, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ సోడిశెట్టి బాలాజీ, బీజేవైఎంఎం జిల్లా అధ్యక్షుడు రాము, హరికృష్ణ, మట్టి వెంకటేశ్వరరావు, వెంకట సతీష్, ఫణి తదితరులు పాల్గొని ప్రసంగించారు. అమాయకులైన గిరిజనుల మీద మమతా బెనర్జీ దాడులు చేస్తోందన్నారు.



వెనిగండ్ల రాముకు 19వ వార్డులో స్వాగతం పలుకుతున్న మహిళలు



నమ్మితాలకుంట పల్లెబాటలో వర్ల కుమార్‌రాజా



పాశ్యాపురంలో దళిత నాయకులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న కాగిత కృష్ణప్రసాద్

అవినీతి వైసీపీని తరిమికొట్టండి

● కొడాలి నానీని ప్రజలు ఛీత్కరించుకుంటున్నారు : వెనిగండ్ల రాము ● జగన్‌కు ఓటమి భయం పట్టుకుంది : కుమార్ రాజా ● 50 దళిత కుటుంబాలు టీడీపీలో చేరిక

గుడివాడ, మార్చి 1 : అభివృద్ధిని మరచిన ఎమ్మెల్యే నానీని ప్రజలు ఛీదరించుకుంటున్నారని, అవినీతి వైసీపీ నాయకులను తరిమికొట్టాలని గుడివాడ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. గుడివాడలోని 19, 23 వార్డుల్లో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్‌లతో కలిసి వెనిగండ్ల బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని చేపట్టి ఇంటింటికి వెళ్లి ప్రజాసమస్యలను తెలుసుకున్నారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే అమలు చేసే గ్యారెంటీలను ప్రజలకు వివరించారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే ప్రజా సమస్యలు పరిష్కారమ వుతాయన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, టీడీపీ, జనసేన పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు, మజ్జి శ్రీనివాస్, స్థానిక నాయకులు వల్లభనేని రత్నకుమార్, పంచుమర్తి శ్రీనివాసరావు, పలిశెట్టి శ్రీను, కోవెలకారు సూరిబాబు, పిడుగు గోపి, కొండా రాంబాబు, షేక్ మున్నా, వేమూరి ప్రతిమ, పలిశెట్టి నాంచారమ్మ, కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు, మరీదు సరస్వతీ, లక్ష్మీ, వెంకటేశ్వరరావు, అల్లాడ హైమావతి, గెల్లా పద్మావతి, సూరిబాబు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ గ్యారెంటీలను విస్తృతంగా ప్రచారం చేయాలి : కాగిత



పెడన రూరల్ : రానున్న ఎన్నికలలో టీడీపీ ప్రకటించిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృత స్థాయి లో ప్రచారం చేయాలని పెడన నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. గూడూరు మండలం పార్టీ కార్యాలయంలో మండల పార్టీ నాయకులు, గ్రామ కమిటీ పరిశీలకులు, బూత్, క్లస్టర్ యూనిట్ ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. మినీ మానిఫెస్టోలోని పథకాలను మహిళలకు ప్రజలకు వివరించటంతోపాటు, రాష్ట్రాభివృద్ధి జరగాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి ఐతేనే సాధ్యమని వివరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలన్నారు. పోతన స్వామి, కాసగాని శ్రీనివాసరావు, కట్టా మునేశ్వరరావు, ఎస్ఎ బేగ్, గోపి నాగబాబు, కూనపరెడ్డి వీరబాబు పాల్గొన్నారు.

పాశ్యాపురం దళితవాడలో 50 కుటుంబాలు టీడీపీలో చేరిక

కృత్తివెన్ను : చినపాండ్రాక పంచాయతీ పాశ్యాపురం దళితవాడలోని వైసీపీ సానుభూతిపరులుగా ఉన్న 50 కుటుంబాలు టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ నాయకత్వంలో శుక్రవారం టీడీపీలో చేరారు. ఎస్సీ కార్పొరేషన్ నిధులు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందని దళితులు తెలిపారు. కాగిత కృష్ణప్రసాద్ వారిని టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు.

పథకాల పేరిట జగన్ బ్లాక్‌మెయిల్ : కుమార్ రాజా

నమ్మితాలకుంట (పమిడిముక్కల) : ఓటమి భయంతో వణికిపోతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నోటికొచ్చింది మాట్లాడుతున్నారని నియోజకవర్గ ఇన్‌చార్జ్ టీడీపీ ఇన్‌చార్జి వర్లకుమార్ రాజా ఎద్దేవా చేశారు. పల్లెబాట కార్యక్రమంలో 26 రోజు శుక్రవారం నమ్మితాలకుంట, లంకపల్లి, శ్రీరంగపురం గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. టీడీపీ, జనసేన పార్టీలు అధికారంలోకి వచ్చిన తరువాత సమస్యలు తప్పక పరిష్కరిస్తామని హామీఇచ్చారు. పథకాల పేరిట ప్రజలను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సభకు పామర్రులో పచ్చని చెట్లు నరికి వాతావరణ సమతుల్యత దెబ్బతీశారన్నారు. ఎన్నికలకు నెల ముందు రోడ్లువేస్తాం, సమస్యలన్నీ తీర్చి వేస్తామనడం హాస్యాస్పదంగా ఉం దన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు ఆర్ శ్రీనివాసరావు, కార్యదర్శి కొల్లూరి బాబ్జి, బీసీ సెల్ కార్యదర్శి శివకృష్ణ, వెంకట రామయ్య, బోస్, మాజీ సర్పంచ్ గోల్డ్‌మేన్, అంజయ్య, సురేశ్‌కుమార్, తెలుగు యువత, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

జగన్‌ను ఓడిస్తేనే మేలు : గురుమూర్తి

తోట్లవల్లూరు : పామర్రు నియోజకవర్గానికి ఎలాంటి వరాలు ప్రకటించకుండా సీఎం జగన్ ప్రజలకు నిరాశ మిగిల్చారని, వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఓడించాలని రాష్ట్ర టీడీపీ బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి అన్నారు. తోట్లవల్లూరులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాములలంకకు బ్రిడ్జి, ఇళ్ల స్థలాలు, రహదారుల సమస్యలు ఎన్నో ఉండగా ఒక్క సమస్యపై కూడా సీఎం హామి ఇవ్వలేకపోయారన్నారు. ఇలాంటి హంతకుల పార్టీని అధికారంలో లేకుండా చేస్తేనే రాష్ట్రానికి మేలు జరుగుతుందన్నారు.

మృతుల కుటుంబాలకు వెంకట్రామ్ పరామర్శ



కోడూరు : మృతుల కుటుంబసభ్యులను శుక్రవారం టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ పరామర్శించారు.

నక్కవానిదారి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన అప్పికట్ల విజయబాబు కుటుంబసభ్యులను, దింటిమెరకలో మృతి చెందిన తిరుమలశెట్టి నాగేశ్వరరావు, హంసలదీవిలో మృతి చెందిన కోలా కృష్ణమూర్తి కుటుంబసభ్యులను వెంకట్రామ్ పరామర్శించి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మండల పార్టీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు, కడవకొల్లు నాంచారయ్య, ఇజ్జినేని శివాజీ, గోగినేని సోమశేఖరరావు, పిల్లి మల్లిఖార్జునరావు, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, తోట రాంబాబు, మేడా శివాజీ, కోట సుబ్బారావు, దావు మల్లి, కుంచే రామకృష్ణ, గుడివాక నరహరి, అప్పికట్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింట్లున్నూ, గుడివాడ రూరల్ మండలం, రామనపూడి గ్రామ కాపురస్తులునూ అయిన నిమ్మగడ్డ వెంకట రామారావు గారి కుమారులు 1) నిమ్మగడ్డ అప్పారావు, 2) నిమ్మగడ్డ రాజమన్నార్, 3) నిమ్మగడ్డ (లేటు) అశోక్ బాబు గారి భార్య సౌభాగ్యలక్ష్మి, 4) నిమ్మగడ్డ (లేటు) అశోక్ బాబు గారి కుమార్తెలు సూరపనేని సంధ్య, భర్త: సూరపనేని వంశీ మోహన్, 5) సూర్యదేవర రమ్య, భర్త: సూర్యదేవర కిరణ్ సిన్హా గార్ల ఇన్‌స్ట్రక్షన్స్ ప్రకారం యావన్మందికీ తెలియజేయునది ఏమనగా..

నా క్లయింట్లలో 1 మరియు 2వ వార్లు నిమ్మగడ్డ (లేటు) వెంకట రామారావు గారికి కుమారులనియూ, 3వ వారు వెంకట రామారావు గారికి కోడలునూ, (లేటు) అశోక్ బాబుగారికి భార్యయున్నూ అయివున్నారనియూ, 4, 5 వార్లు (లేటు) అశోక్ బాబుగారికి కుమార్తెలు అయివున్నారనియూ, నిమ్మగడ్డ వెంకట రామారావు గారికి మనుమరాండ్రు అయి వున్నారనియూ, సదరు నిమ్మగడ్డ వెంకట రామారావు గారు ఆయన జీవిత కాలములో ఆయనకు సంబంధించిన అనమనపూడి గ్రామములోని పొలాలు, ఇండ్లు, ఇళ్ల స్థలాలు మరియు ఎ.ఐ.సి. 4779 నెంబరు గల అశోక్ లేలాండ్ లారీని అమ్మి, అమ్మగా వచ్చిన ప్రతిఫలముతో యీ దిగువ ఉదహరించిన షెడ్యూలు స్థిరాస్తిని కోలకలూరి సిద్ధార్థిని, భర్త: భవానీ ప్రసాద్ నుంచి షెడ్యూల్లో ఉదహరించిన 484 చ.గ. నివేశన స్థలమును ది.09.07.1991వ తేదీన రూ.12,100/-లు (అక్షరాలా పన్నెండు వేల ఒక వంద రూపాయలు)కు క్రయము పొంది క్రయ ప్రతిఫలము వెంకట రామారావు సిద్ధార్థిని గారికి చెల్లించి, పేరు బలాలు మరియు గ్రహ బలాలను దృష్టిలో పెట్టుకొని నిమ్మగడ్డ వెంకట రామారావు గారు ఆయన కుమారుడైనటువంటి నిమ్మగడ్డ శ్రీనివాసరావు గారి పేరున ది.09.07.1991వ తేదీన క్రయ దస్తావేజు వ్రాయించి రిజిస్టరు చేయించి వున్నారనియూ, సదరు స్థలములో వెంకట రామారావు గారు జీవించి వుండగానే రేకుల షెడ్డు మరియు పూరిల్లు నిర్మించివున్నారనియూ, సదరు శ్రీనివాసరావు గారికి దిగువ ఉదహరించిన షెడ్యూలు ఆస్తిని క్రయం పొందే ఆర్థిక శక్తి కూడా లేదనియూ, పై చెప్పిన విధంగా క్రయ ప్రతిఫలము వెంకట రామారావు గారే చెల్లించివున్నారనియూ, దర్మిలా షెడ్యూలు ఆస్తిని వెంకట రామారావు గారు, నా క్లయింట్లు సదరు శ్రీనివాసరావు జాయింటు ఆస్తిగా పరిగణించి పూర్తి హక్కులతో అనుభవించు చున్నారనియూ, సదరు 484 చ.గ. ల స్థలములో 3వ వారికి భర్తగారు 4.5 వార్లకు తండ్రి గారు అయిన అశోక్ బాబు గారి పేరున మరియు శ్రీనివాసరావు గారి పేరున ఎ.పి. హౌసింగ్ బోర్డు నుండి ఎ.పి. హౌసింగ్ లోను కూడా తీసుకొని డాబా నిర్మించి వున్నారనియూ, ఈ విధంగా జాయింటుగా అనుభవించుచుండగా శ్రీనివాసరావు గారు ది.08.07.2023వ తేదీన ఆకస్మికంగా మరణించినారనియూ, దర్మిలా ఆయన భార్య అయిన మంజుల గారు షెడ్యూలులో ఉదహరించిన ఆస్తి ఆమెదని చెప్పుచూ అమ్ముటకు బేరం పెట్టినట్లుగా నా క్లయింటుకు తెలియవచ్చినది. నా క్లయింట్లు తెలియజేయునది ఏమనగా షెడ్యూలు ఆస్తిపై మంజుల గారికి ఏ విధమైన హక్కులు గానీ, ఆమె స్వాధీనంలో లేదనియూ, నా క్లయింట్లు మాత్రమే హక్కులు కలిగియున్నారనియు, కావున మంజుల గారితో షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరైనా, ఏ విధమైన ఆర్థిక లావాదేవీలు కానీ, బ్యాంకు లావాదేవీలు కానీ, ఏవిధమైన క్రయ ఒప్పందములు కానీ కుదుర్చుకున్నా అవి నా క్లయింటు హక్కులను బైండు చేయజాలవనీ, చట్టరీత్యా చెల్లవనీ యావన్మందికి ఇందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు : కృష్ణాజిల్లా, గుడివాడ సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా రామనపూడి గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన రామనపూడి ఆర్.యస్.నెం. 194/2లో 484 చ.గ. నివేశన స్థలము. అందులో డోర్ నెం.2-64 రామనపూడి గ్రామ పంచాయితీ డోర్ నెంబరుతో వున్నటువంటి రేకుల షెడ్డు పూరిల్లు డాబాకు హద్దులు: తూర్పు : పంటకాలువ, దక్షిణం : మేరుగు సీతామాలక్ష్మి విక్రయించిన భూమి, పడమర : గుడివాడ టు పామర్రు రోడ్డు, ఉత్తరం : వేస్సంశెట్టి నాగ శ్యామలరావు తాలూకు భూమి. ఈ హద్దుల మధ్య 484 చ.గ.ల నివేశన స్థలము. అందులో డోర్ నెం.2-64 రామనపూడి గ్రామ పంచాయితీ డోర్ నెంబరుతో వున్నటువంటి రేకుల షెడ్డు పూరిల్లు డాబా.

గుడివాడ, 01-03-2024. జి.అప్పయ్య, అడ్వకేట్ గుడివాడ-521 301. సెల్: 9441120300

క్రీడా, సాహితీ దినోత్సవం



గుడ్లవల్లేరు : చదువుతో పాటు క్రీడలు, సాహిత్యం పట్ల విద్యార్థుల్లో ఆసక్తి కల్పించడం ముదావహమని ఆర్డీవో ఎ.విజయ సారథి అన్నారు. ఎ.ఎ.ఎన్.ఎం అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ హైస్కూల్‌లో క్రీడా, సాహితీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విశిష్ట అతిథి, యూనియన్ బ్యాంక్ మేనేజర్ దుర్గా ప్రసాద్ క్రీడా పతాకాన్ని, పాఠశాల హెచ్‌ఎం మురళీకృష్ణ పాఠశాల పతాకాలను ఆవిష్కరించారు. విద్యార్థుల సాహిత్య ప్రదర్శనలు, క్రీడా విన్యాసాలు ఆకట్టుకున్నాయి. సాహితీ అతిథిగా జన్ను చిరంజీవులు, డి.బి ప్రసాద్, పాఠశాల డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి, క్రీడా కోఆర్డినేటర్ జి.సత్తిబాబు, సాహితీ కోఆర్డినేటర్ ఆంటోని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలి

మచిలీపట్నం టౌన్ : విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకుంటూ ఉన్నత స్థితికి ఎదగాలని మచిలీపట్నం డివిజన్ పోస్టల్ సూపరిండెంట్ కత్తి ఆదినారాయణ అన్నారు. మచిలీపట్నం బాలాజీ విద్యాలయంలో శుక్రవారం జరిగిన విద్యా వైద్య ప్రదర్శనను ఆదినారాయణ ప్రారంభించారు. పోస్టల్ శాఖ ఇటీవల నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపిన రాగ సృజనకు ఆరు వేల రూపాయల స్కాలర్‌షిప్, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. బాలాజీ విద్యాలయం మాజీ ప్రిన్సిపాల్ తుర్లపాటి గిరీష్‌బాబు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పోస్టల్ ఇనస్పెక్టర్ చంద్రశేఖర్ తదితరులు మాట్లాడారు. ఉత్తమ ప్రాజెక్టులు ప్రదర్శించిన విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ కొమ్మరగిరి చంద్రశేఖర్ బహుమతులు అందజేశారు.



విద్యార్థినికి ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ ఆదినారాయణ

అదుపు తప్పి చెట్టును ఢీకొన్న కారు

● ఇద్దరికి గాయాలు

మోపిదేవి : విజయవాడ నుంచి కృష్ణానది కరకట్ట మీదుగా వస్తున్న కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టిన ఘటన మండలంలోని బొబ్బర్లంక వద్ద శుక్రవారం ఉదయం జరిగింది. అవనిగడ్డ వస్తున్న కారు బొబ్బర్లంక వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి చెట్టును ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలు కావటంతో 108 అంబులెన్స్‌లో అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మోపిదేవి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గొర్రెపాటి విద్యా ట్రస్ట్ సేవలు అనిర్వచనీయం

ఘంటసాల : గొర్రెపాటి వెంకట్రాయులు - ఉదయభాస్కరమ్మ విద్యా ట్రస్ట్ సేవలు అనిర్వచనీయమని వక్తలు కొనియాడారు. ఘంటసాలలో ఎన్‌ఆర్‌ఐ గొర్రెపాటి రంగనాథ్ బాబు తల్లి ఉదయ భాస్కరమ్మ ఏడో వర్ధంతిని శుక్రవారం బౌద్ధగురువులు బంతేజీ ఆధ్వర్యంలో బౌద్ధ సంప్రదాయాలతో నిర్వహించారు. కల్లుగీత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాకా రామచంద్రరావు మాట్లాడుతూ గత 36 సంవత్సరాలుగా గొర్రెపాటి విద్యాట్రస్ట్ ద్వారా ఎన్‌ఆర్‌ఐ రంగనాథ్ బాబు ఘంటసాల, చల్లపల్లి మండలాల్లో ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ప్రముఖులు మల్లుపెద్ది రాజా, విద్యాట్రస్ట్ ప్రతినిధులు కొండపల్లి రామకృష్ణ, గొర్రెపాటి వెంకట్రావు, కౌలు రైతు సంఘం నాయకులు భలే రమేష్, భలే జనార్ధన్‌రావు, పిడిగే ఆదినారాయణ పాల్గొన్నారు.



ఉదయ భాస్కరమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామ ప్రముఖులు



మాదిగ అమరవీరులకు నివాళి

ఘంటసాల : ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో అమరులైన మాదిగ వీరులకు సూరపనేనివారిపాలెం గ్రామంలో శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొకినాల కృష్ణ అమరవీరుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. 30 ఏళ్లకుపైగా మాదిగలకు ఎస్సీలలో తమ వాటా దక్కాలని మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో పోరాటం జరుగుతుందన్నారు. పచ్చిగళ్ల ధనవుంజయరావు, కుంపటి మారమ్మ, నాగరాజు, రాహేలు, ఈపూరి వెంకటేశ్వరరావు, కొడాలి బుడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్యాం కిషోర్ ఆర్థిక సాయం

అవనిగడ్డ రూరల్ : అవనిగడ్డలోని సింహాద్రి కాలనీకి చెందిన ముళ్లపూడి వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందగా, వెన్ను సమస్యతో బాధపడుతున్న వెంకటేశ్వరరావు భార్య వెంకట నరసమ్మకు శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు తోట శ్యాం కిషోర్ నాయుడు రూ.5 వేల ఆర్థిక సాయమందించారు. డేగల రాఘవ, తోట నరసింహనాయుడు, మోపిదేవి కోటేశ్వరరావు, సాయి ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియో విజయవంతం చేయాలి

నాగాయలంక : ఈ నెల 3వ తేదీన నాగాయలంక పీహెచ్‌సీలో నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎం.ఇంద్రకుమార్ రెడ్డి కోరారు. పీహెచ్‌సీ పరిధిలో 0-5 వయస్సు గల పిల్లలు 2,885 మంది ఉండగా, 27 కేంద్రాలు ఏర్పాటు చేసి చిన్నారులకు పోలియో చుక్కలు ఇస్తున్నామన్నారు. 4వ తేదీన ఇంటింటికి తిరిగి మిగిలిన పిల్లలకు చుక్కలు వేసి లక్ష్యాన్ని పూర్తి చేస్తామన్నారు. తల్లి దండ్రులు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పోతురాజు స్వామి గుడిని అప్పగించాలని వినతి

పెడన : పట్టణంలోని పోతురాజు స్వామి గుడిని తమకు అప్పగించాలని కోరుతూ శిష్టకర్ణ కులస్తులు మునిసిపల్ చైర్‌పర్సన్‌కు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. తమ పూర్వీకులు 140 సంవత్సరాల క్రితం ఈ గుడిని నిర్మించారని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. తమ పూర్వీకులు నిర్మించిన గుడి కాబట్టి అది తమకే చెందుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో రౌతుల వెంకటేశ్వరరావు, వీణం శ్రీనివాస్, రౌతుల ప్రసాద్, వీణం వెంకటేశ్వరరావు, ఏలూరు లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఆలయ గోవుకు అంత్యక్రియలు

మోపిదేవి : పెదప్రోలు అద్దంకి నాంచారమ్మ అమ్మవారి దేవస్థానానికి చెందిన గో వు అనారోగ్యంతో మృతి చెందగా దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. దేవస్థానం గోశాలలో 20 సంవత్సరాలుగా ఉంటూ 400 గృహ ప్రవేశాలు, ఇతర శుభకార్యాలకు గోమాతను వినియోగించినట్లు తెలిపారు.

దేవస్థానం భూమిలో హిందూ సంప్రదాయబద్ధంగా ఖననం చేసి అంత్యక్రియలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కె.గురు ప్రసాద్, కార్యదర్శి కె.వి.ఎన్.కె.కోటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

మొవ్వలో ఇంటర్ పరీక్ష ప్రశాంతం

కూచిపూడి : కట్టుదిట్టమైన భద్రత మధ్య క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పరీక్ష ప్రారంభమైంది. తొలి రోజు 169 మందికి 160 మంది విద్యార్థులుహాజరయ్యారు. అవనిగడ్డ సిట్టింగ్ స్క్వాడ్ మూడు గంటలపాటు పరీక్షా కేంద్రంలోనే ఉన్నారు. సిఎస్ కె.మహేష్‌బాబు, డీవో ఏ.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

విద్యార్థులకు వెనిగండ్ల మజ్జిగ పంపిణీ

గుడివాడ : గుడివాడలోని ఆరు ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద శుక్రవారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

అష్టలక్ష్మీ ఆలయంలో విశేష పూజలు



గుడివాడ రూరల్ : చిన ఎరుకపాడులోని అష్టలక్ష్మీ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకోగా అర్చకులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రబీ పంటలను నమోదు చేసుకోవాలి

పెడన రూరల్ : మండలంలో రబీ ఈక్రాప్ బుకింగ్ ప్రక్రియ మొదలైందని రైతులు దగ్గరలో ఉన్న రైతు భరోసా కేంద్రాలలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. పెనుమల్లి రైతు భరోసా కేంద్రంలో రబీ ఈక్రాప్ రైతుల జాబితా ప్రదర్శన, గ్రీవెన్స్ స్వీకరణ, సామాజిక తనకీ గ్రామసభలలో పాల్గొన్నారు. సర్పంచి గరికపాటి రామానాయుడు, ఊచా వెంకటేశ్వరరావు, రాజులపాటి అచ్యుతరావు, పరసా గోవింద రైతులు పాల్గొన్నారు.

విజయ కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు

మచిలీపట్నం టౌన్ : బందరు మండలం పోతేపల్లి జ్యూయలరీ పార్కులోని విజయకనకదుర్గ దేవాలయంలో అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కాగిత ఏడుకొండలు ఆధ్వర్యంలో అన్నసమారాధన కార్యక్రమం జరిగింది.

ఉన్నత విద్యలో సంస్కరణలపై సదస్సు నేడు

గుడ్లవల్లేరు : శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ కె.రామమోహనరావు శనివారం విచ్చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్ తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో యు వత సాధికారత సాధించేందుకు ఉన్నత విద్యలో సంస్కరణలు అనే అంశంపై సదస్సులో ప్రసంగిస్తారన్నారు.